నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 16 ఏప్రిల్ 2024 | KHAMMAM

అల్పాహారానికి మంగళం

- భద్రాద్రి జిల్లాలో మూడు స్కూళ్లలో నిలిపివేత
- నిరుత్సాహంలో విద్యార్థులు

అల్పాహారం తింటున్న విద్యార్థులు (ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మూడు పాఠశాలల్లో 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' పథకానికి మంగళం పలికారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 23 మండలాల్లో మండలానికి ఒకటి చొప్పున అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించింది. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రతి మండలంలో ఉన్న పాఠశాలలకు ఈ పథకాన్ని వర్తించాల్సింది పోయి అమలుచేసే పథకానికి మంగళం పలికేలా బిల్లులు రాకుండా చేస్తున్నది. దీంతో పథకం ఆటకెక్కింది. జిల్లాలో ఇప్పటివరకు పాఠశాలల్లో వంటలు చేసే వర్కర్లకు రూ.11 లక్షలకు పైగా నగదు రావాల్సి ఉందని వారు లబోదిబోమంటున్నారు. ఉపాధ్యాయులు బిల్లులు వస్తాయి నడిపించండి అంటే బలవంతంగా నడిపిస్తున్నామని వారు ఆవేదన చెందుతున్నారు. సుజాతనగర్, పాల్వంచ, పినపాక మండలాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం పెట్టడం లేదు.

నాస్తా నై...

- స్కూళ్లలో 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' పథకానికి కాంగ్రెస్ ఫుల్‌స్టాప్
- విద్యార్థుల ఆకలి పట్టని ప్రభుత్వం
- ఖమ్మంజిల్లాలో 22 స్కూళ్లకు రెండింటిలోనే అమలు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మూడు మండలాల్లో నిలుపుదల
- ఆగ్రహం వ్యక్తంచేస్తున్న తల్లిదండ్రులు

ఖమ్మం నగరంలోని ఎన్ఎస్‌సీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఖమ్మం, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రంలో గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' పథకానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పాఠశాలలకు వచ్చే పేద విద్యార్థులు ఖాళీ కడుపుతో ఉండొద్దని, ఆకలితో వచ్చి మధ్యాహ్నం వరకు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు వింటూ అవస్థలు పడొద్దని అప్పటి సీఎం కేసీఆర్ 'సీఎం బ్రేక్‌ఫాస్ట్' పథకానికి శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ఉదయం అల్పాహారం అందించి వారి ఆకలి తీర్చడంతోపాటు ఎదుగుదలకు దోహదపడే విధంగా పోషకాహారం అందించారు. 2023 అక్టోబర్ 6వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పున ఎంపిక చేసి.. తర్వాత మరికొన్ని పాఠశాలలకు విస్తరించి పథకాన్ని అమలు చేశారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారు. అయితే ఇటీవల అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకానికి ఫుల్‌స్టాప్ పెట్టింది. విద్యార్థుల ఆకలిని ఏమాత్రం పట్టించుకోకుండా అల్పాహారాన్ని ఆపేశారు.

ఖమ్మంజిల్లాలో 22 స్కూళ్లకి కేవలం రెండింటిలో అమలు..

గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఖమ్మంజిల్లాలో మొత్తం 22 స్కూళ్లలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలుచేశారు. అత్యధికంగా ఖమ్మం నగరంలో 14 స్కూళ్లలో నిర్వహించారు. రోటరీనగర్ హైస్కూల్, రోటరీనగర్ ప్రాథమిక పాఠశాల, నయాబజార్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జీపీఎస్ బొక్కలగడ్డ, ఎన్ఎస్‌సీ కాలనీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జీసీఎస్ బుర్హాన్‌పురం, జీపీఎస్ రమణగుట్ట, జీహెచ్ఎస్ రిక్కాబజార్, గాంధీనగర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, జీపీఎస్ జూబ్లీపుర, జీపీఎస్ గుట్టలబజార్ స్కూల్స్ ఉన్నాయి. వీటితోపాటు ముదిగొండలోని ఎంపీపీఎస్ బాణాపురం, సత్తుపల్లిలోని ఎంపీపీఎస్ సత్తుపల్లి, వైరాలోని సీపీఎస్ వైరా, ఎర్రుపాలెంలోని ఎంపీపీఎస్ బనిగండ్లపాడు, కూసుమంచిలోని జడ్పీహెచ్ఎస్ పాలేరు, ఖమ్మం రూరల్‌లోని జడ్పీహెచ్ఎస్ జలగంనగర్, మధిరలోని ఎంపీపీఎస్ బాలికల పాఠశాల, తిరుమలాయపాలెం యూపీఎస్, దమ్మాయిగూడెం పాఠశాలలున్నాయి. వీటిలో 20 స్కూల్స్‌లో మధ్యాహ్న భోజనం అందించే ఏజెన్సీల ద్వారా సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అందించగా, ఖమ్మంలోని రోటరీనగర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు మాత్రం వరంగల్‌లోని అక్షయపాత్ర ఏజెన్సీ ద్వారా అందిస్తోంది. అయితే ప్రస్తుతం రోటరీనగర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు మినహా మిగిలిన పాఠశాలల్లో అల్పాహార పథకం నిలిచిపోయింది.

నిరుత్సాహంగా విద్యార్థులు..

సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేసినప్పుడు విద్యార్థులు సమయానికి కంటే ముందుగానే పాఠశాలకు చేరుకోవడం, తరగతి గదుల్లో ఉత్సాహంగా పాఠాలు వినడం వంటివి కనిపించేవి. ఈ పథకం వల్ల విద్యార్థులకు పోషకాహారంతోపాటు పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య పెరిగింది. పథకం ఆగిన తర్వాత పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు నిరుత్సాహపడ్డారు. ఆకలితో పాఠాలు వినే రోజులు మళ్లీ వచ్చాయని బాధపడుతున్నారు.. అల్పాహారం అందించాలని అధికారులను కోరుతున్నారు.

ఖమ్మంజిల్లాలో వింత వాదన..

ఖమ్మం జిల్లాలో అత్యధిక స్కూల్స్‌లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ఆపేసి విద్యార్థుల ఆకలితో విద్యాశాఖాధికారులు ఆడుకుంటున్నారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు అధికారుల మౌఖిక ఆదేశాలతో బ్రేక్‌ఫాస్ట్ పథకం ఆగిందని పేర్కొంటుండగా, అధికారులు మాత్రం ప్రధానోపాధ్యాయులు అల్పాహారానికి విద్యార్థులు ఆసక్తి చూపడంలేదని, మధ్యాహ్న భోజన నిర్వాహకులు అల్పాహారం అందించట్లేదని పేర్కొనడం గమనార్హం. మధ్యాహ్న భోజన నిర్వాహకులు అల్పాహారం అందించకపోతే ఏవైనా కారణాలరీత్యా వారి నుంచి వివరణ తీసుకోవడం లేదా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. ఇవేమీ లేకుండా బాధ్యత లేకుండా ఏజెన్సీ వాళ్ళు సరఫరా చేయడం లేదంటున్నారు.

కిచెన్‌షెడ్లు స్టోర్‌రూమ్‌లుగా..

గత కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో సకల సదుపాయాలు కల్పించేందుకు మన ఊరు- మన బడి ద్వారా రూ.కోట్లు ఖర్చుచేసింది. దీనిలో భాగంగా విద్యార్థులకు వేడివేడి అన్నం అక్కడే పాఠశాలల్లో వండేందుకు అనువుగా కిచెన్ షెడ్లు నిర్మించింది. వాటిని ప్రస్తుతం పాఠశాలల్లో వంట చేసేందుకు కాకుండా స్టోర్‌రూమ్‌లుగా వినియోగిస్తున్నారు.

పెట్టిన వాటికే బిల్లుల్లేవు..

విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించాలని పాఠశాల హెచ్ఎం చెప్పారు. గత ఏడాది 40 రోజులపాటు విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన విధంగా అల్పాహారం అందించాం. ఇప్పటివరకు ఆ బిల్లులు రాలేదు. అందుకే పాఠశాలలో అల్పాహారం ఆపివేశాం.

– నిమ్మటూరి కృష్ణవేణి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, సత్తుపల్లి

టిఫిన్ పెట్టేలా చూడండి..

మేము బడికి వెళ్లగానే టిఫిన్ పెట్టే వారు. మా అమ్మ వాళ్లు పనికి వెళ్లేందుకు అన్నం వండుకున్నా.. మేము మాత్రం బడికి వెళ్లి టిఫిన్ తినేవాళ్లం. మధ్యాహ్న భోజనం పెట్టేవరకు ఆకలి అయ్యేదికాదు. ఎందుకో బడిలో ఇప్పుడు ఉదయం టిఫిన్ పెట్టడం లేదు. దీనివల్ల చాలా మంది పిల్లలు బడికి రావడం లేదు. మళ్లీ బడిలో పిల్లలకు టిఫిన్ పెట్టేలా చూడండి.

– బానోత్ అమ్ములు, కుక్కలతండా పీఎస్, తిరుమలాయపాలెం మండలం, ఖమ్మం జిల్లా

పొద్దున్నే ఆకలేస్తోంది..

సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద గతంలో చాలా రోజుల వరకు మా బడిలో టిఫిన్ పెట్టారు. ప్రస్తుతం 15 రోజుల నుంచి పెట్టడం లేదు. ఉదయమే బడికి వెళ్తుంటే బాగా ఆకలేస్తోంది. టిఫిన్ పెడితే బాగుండు అని అనిపిస్తుంది. మా సార్‌కు ఈ విషయం చెబితే పెట్టిస్తామన్నాడు. కానీ.. పెట్టడం లేదు. మాకందరికి మళ్లీ సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద టిఫిన్ పెట్టాలి.

– వంశీ, 5వ తరగతి, దామరచర్ల పీఎస్, చండ్రుగొండ మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

బిల్లులు రావట్లేదని బంద్ చేశాం

గత ఏడాది నుంచి సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద విద్యార్థులకు టిఫిన్ వండి పెడుతున్నాం. ప్రస్తుతానికి బిల్లులు రాకపోవడంతో 15 రోజుల నుంచి బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని నిలిపివేశాం. బిల్లులు రాకపోవడంతో పిల్లలకు వంట చేయడం కష్టంగా ఉంది. అప్పులు పెరుగుతున్నాయి. మాకు బిల్లులు ఇస్తే వంటలు వండిస్తాం. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని మళ్లీ వండి పెట్టాలంటే బిల్లులు ఇస్తేనే కొనసాగిస్తాం.

– నూర్జహాన్, మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలు, దామరచర్ల పీఎస్, చండ్రుగొండ మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

తిరిగి ప్రవేశపెట్టాలి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ఎత్తివేసింది. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలనే లక్ష్యంతో గత కేసీఆర్ ప్రభుత్వం సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. మంచి ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నిలిపివేసింది. ఆ పథకాన్ని వెంటనే తిరిగి ప్రవేశపెట్టాలి.

– బానోత్ సూర్యానాయక్, విద్యార్థి తండ్రి, కుక్కలతండా, తిరుమలాయపాలెం మండలం, ఖమ్మం జిల్లా

చాలా మంచి పథకం

గత ప్రభుత్వ హయాంలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం పెట్టారు సక్సెస్ అయింది. కానీ ఇలాంటి పెద్ద స్కూల్‌లో బడ్జెట్ రాకపోతే వంట వాళ్లు చేయలేరు కదా.. అందుకే వాళ్లు బంద్ చేశారు. పేదవారు చదువుకునే పాఠశాలకు టిఫిన్ పెడితే ఎక్కువ మంది పిల్లలు బడికి వచ్చే అవకాశం ఉంటుంది. పథకాన్ని కొనసాగించాలి.

– నేతాజీ, హెచ్ఎం, సుజాతనగర్ ప్రభుత్వ పాఠశాల

విద్యార్థులు ముందుగా వచ్చేవారు..

విద్యార్థులకు అందించిన అల్పాహారం చాలా బాగుండేది. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేసినప్పుడు విద్యార్థులు సమయం కంటే ముందుగానే స్కూల్‌కి చేరుకునేవారు. గతంలో ప్రార్థన సమయంలో కొందరు విద్యార్థులు స్పృహ తప్పేవారు, అల్పాహారం పథకం అమలప్పుడు అలాంటి సంఘటనలు లేవు. పాఠశాలలో 856 మంది ఉంటే రోజు సుమారు 720 మందికిపైగా అల్పాహారం స్వీకరించేవారు.

– శంకర్‌రావు, హెచ్ఎం, ఎన్ఎస్‌సీ కాలనీ ప్రభుత్వ పాఠశాల, ఖమ్మం

అల్పాహారం అవసరం..

విద్యార్థుల ఆకలి తీర్చేందుకు ప్రవేశపెట్టిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కొనసాగిస్తే చాలా బాగుంటుంది. పేదపిల్లలకు ఇండ్లల్లో అంత పొద్దున్నే భోజనాలు అవ్వవు.. అల్పాహారం వల్ల విద్యార్థులకు చాలా ఉపయోగపడింది. అల్పాహారం తీసుకోవడం వలన బ్రెయిన్ మంచిగా పనిచేస్తుంది. ఖాళీ కడుపుతో చదువుకునే విద్యార్థులు చదువులో కొంత వెనుకబడడం గమనించాం. బ్రేక్‌ఫాస్ట్ కొనసాగిస్తే విద్యార్థుల ఆకలి తీరుతుంది.

– ఎం. జైపాల్, హిందీ టీచర్, ఎన్ఎస్‌సీ కాలనీ ప్రభుత్వ పాఠశాల

తిరిగి ప్రవేశపెట్టాలి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ఎత్తివేసింది. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలనే లక్ష్యంతో గత కేసీఆర్ ప్రభుత్వం సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. మంచి ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నిలిపివేసింది. ఆ పథకాన్ని వెంటనే తిరిగి ప్రవేశపెట్టాలి.

– బానోత్ సూర్యానాయక్, విద్యార్థి తండ్రి, కుక్కలతండా, తిరుమలాయపాలెం మండలం, ఖమ్మం జిల్లా

రాములోరి కల్యాణానికి పర్ణశాల ముస్తాబు

- చకచకా జరుగుతున్న ఏర్పాట్లు
- వేలాదిగా తరలిరానున్న భక్తజనం

కల్యాణానికి సిద్ధమైన కల్యాణ మంటపం



పర్ణశాల, ఏప్రిల్ 15 : శ్రీరామ నవమి సందర్భంగా ఈ నెల 17వ తేదీన జరగనున్న సీతారాముల కల్యాణానికి పర్ణశాల పుణ్యక్షేత్రం ఎంతో సుందరంగా ముస్తాబవుతోంది. పర్ణశాలలో జరిగే రాములోరి కల్యాణాన్ని తిలకించడానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. భక్తులను దృష్టిలో పెట్టుకొని అన్నిరకాల సౌకర్యాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయానికి రంగులు, విద్యుత్ వెలుగులతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయ పంచవటిలో ఉన్న సీతారాములు, లక్ష్మణ, రావణాసురుడు విగ్రహాలకు రంగులు వేశారు. సీతారాముల కల్యాణానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా కల్యాణ మంటపం వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు నవమి ఫెస్టివల్ ఆఫీసర్ అనిల్ తెలిపారు. రాములవారి కల్యాణానికి ఉభయదాతలుగా రూ.1,500 చెల్లించి భార్యాభర్తలు కల్యాణంలో పాల్గొనవచ్చని, వారికి గోత్రనామాలతో అదేరోజు కల్యాణ మంటపంలో కల్యాణం జరిపి స్వామివారి ప్రసాదం, కండువా, జాకెట్‌ముక్క, పెద్ద లడ్డు, కల్యాణ అక్షింతలు అందజేస్తారని పేర్కొన్నారు. ఇప్పటివరకు 11 మంది దంపతులు రూ.1,500 చెల్లించి వారి పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. వేసవి దృష్ట్యా ప్రత్యేక క్యూలైన్‌లు, ప్రధానమార్గంలో గ్రీన్‌మ్యాట్‌లు, తాగునీటి సౌకర్యం, ప్రత్యేక ప్రసాదం కౌంటర్లు, తలంబ్రాల కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు.

విశిష్టమైనది రామాయణ గాథ

భద్రాచలం ప్రాంతానికి చెందిన రామాయణ గాథ ఎంతో విశిష్టమైంది. భద్రాచల రాముడిని భోగా రాముడని, దుమ్ముగూడెం రాముడిని ఆత్మ రాముడని, పర్ణశాల రాముడిని శ్లోక రాముడిగా రామాయణంలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. అయితే పర్ణశాల పుణ్యక్షేత్రంలో సీతారాముల వారు 14 ఏళ్లు అజ్ఞాతవాసం చేశారనే ఉద్దేశంతో భక్తులు ఈ ప్రాంతాన్ని చూసేందుకు ఆసక్తి చూపుతారు. గోదావరి నదీ తీరాన పర్ణశాల వద్ద పంచవటి, నారచీరల ప్రాంతం పర్ణశాల చరిత్రకు సేజీవ సాక్షులుగా మిగిలాయి. ఇంతటి గొప్ప చరిత్ర ఉన్న పర్ణశాల పుణ్యక్షేత్రం సీతారాముల కల్యాణానికి ఎంతో సుందరంగా ముస్తాబైంది. భద్రాచలం రామయ్యను దర్శించుకున్న ప్రతి భక్తుడు పర్ణశాల రామయ్యను దర్శించుకొని పరవశించిపోతుంటారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న పర్ణశాల పుణ్యక్షేత్రానికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రసాద పథకం కింద ప్రత్యేక నిధులు మంజూరు చేసింది.

ఏర్పాట్లు పూర్తి..

పర్ణశాలలో జరిగే సీతారాముల కల్యాణానికి దేవాదాయ శాఖ అధికారులు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు ఎంపీవో ముత్యాలరావు తెలిపారు. పారిశుధ్య పనులు, శానిటేషన్ పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. రాములోరి కల్యాణం చూడటానికి వచ్చే భక్తులకు తాగునీరు, వైద్య శిబిరాలు, దారి పొడవునా టెంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు

దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ కమిషనర్

భద్రాచలం, ఏప్రిల్ 15 : భద్రాచలం సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని వీక్షించడానికి వేలాదిగా వచ్చే భక్తులు మెచ్చేలా సకల ఏర్పాట్లు చేస్తున్నామని సమాచార, పౌర సంబంధాల శాఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. సోమవారం భద్రాచలం వచ్చిన ఆయన మిథిలా స్టేడియంలో రామయ్య కల్యాణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత వైభవోపేతంగా సీతారాముల కల్యాణం జరిగే పవిత్ర పుణ్యస్థలం భద్రాచలమని అన్నారు. శ్రీరామ నవమి రోజు సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తుల కోసం తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లతోపాటు చలువ పందిళ్లు వేస్తున్నామన్నారు. స్వామివారి కల్యాణ వేడుకలు వీక్షించేందుకు మొత్తం 24 సెక్టార్లు ఏర్పాటు చేశామని, ప్రతి సెక్టార్‌లో ఎల్ఈడీ టీవీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యం కోసం ఆన్‌లైన్‌లో టికెట్లు, వసతి గదుల కోసం https://bhadradritemple.telangana.gov.in వెబ్‌సైట్ అందుబాటులో ఉందన్నారు. అనంతరం ఇటీవల భూపాలపల్లి జిల్లాకు బదిలీ అయిన డీపీఆర్వో శ్రీనివాస్ కమిషనర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి మొక్కను అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఈఈ రవీందర్‌రాజు, ఏఈవో శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

అబద్ధాల కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- ప్రజల్లోకి వెళ్లాలి.. పోలింగ్ స్టేషన్ యూనిట్‌గా పనిచేయాలి..
- తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవాలి
- పాల్వంచ విస్తృత సమావేశంలో ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా
- రెండు లక్షల మెజార్టీ ఖాయం: ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు

సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు

మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

పాల్వంచ, ఏప్రిల్ 15: అబద్ధాల కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని ఖమ్మం ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అందుకోసం బీఆర్ఎస్ ఎంపీలను మంచి మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా అన్నారు. పాల్వంచలోని ఓ ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్ అధ్యక్షతన సోమవారం జరిగిన పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు ఎక్కడివారక్కడ బూత్‌స్థాయిలో పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలిసి కేసీఆర్ చేసిన అభివృద్ధిని వివరించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రయోజనాలు కాపాడేందుకు బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఇక్కడి ప్రజల ఆశీర్వాదంతో రెండుసార్లు పార్లమెంట్‌లో అడుగుపెట్టిన తాను.. తెలంగాణ విభజన హక్కుల కోసం అనేక పోరాటాలు చేశానని గుర్తుచేశారు. ప్రాజెక్టులు, నిధులు, ప్రజా సమస్యలపై పార్లమెంటులో తెలంగాణ గళం వినిపించి అనేక సమస్యల పరిష్కారానికి కృషిచేసినట్లు వివరించారు. మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అందరమూ కష్టపడి బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. ఈసారి నామాను రెండు లక్షల మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అలవిగాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ప్రజలే న్యాయ నిర్ణేతలని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు వారు కూడా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక సీట్లతో విజయం సాధించడం ఖాయమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపిస్తే మరింత అభివృద్ధి సాధ్యమని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు తాళ్లూరి జీవన్, బరపటి వాసుదేవరావు, కిలారు నాగేశ్వరరావు, నాయుడు, సరస్వతి, గురవయ్య, రవి, మంజుల, శంకర్, వీరయ్య, శోభారాణి, నేజి, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల పెళ్లికి సిరిసిల్ల చీర

సీతారాముల కల్యాణ చిత్రంతో నేసిన సిరిసిల్ల చీర

భద్రాచలం, ఏప్రిల్ 15 : భద్రాచలంలో సీతారాముల కల్యాణానికి ఏటా సిరిసిల్లలో ప్రత్యేకంగా తయారు చేయించిన చీరను అందిస్తున్నారు వెల్లి హరిప్రసాద్. ఈ ఏడాది 800 గ్రాముల బరువు గల చీరను 2 గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండి, పట్టుధారాలతో నేశారు. అంతేకాక సీతారాముల కల్యాణ చిత్రాన్ని చీర కొంగుపై వేయడంతో చూడముచ్చటగా కనిపిస్తోంది.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు

భద్రాచలం, ఏప్రిల్ 15 : భద్రాచలంలో శ్రీరామ నవమి, పట్టాభిషేకం మహోత్సవాలకు పకడ్బందీ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. సోమవారం భద్రాచలం ఏఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. 2 వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. భక్తుల కొరకు పార్కింగ్ స్థలాలు, లడ్డూ కౌంటర్లు, సెక్టార్ల వివరాలను తెలియజేస్తూ జిల్లా పోలీసు యంత్రాంగం తరపున క్యూఆర్ కోడ్‌ను, అలాగే ఆన్‌లైన్ లింక్‌ను (Error! Hyperlink reference not valid. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

18 నుంచి నామినేషన్ల స్వీకరణ

- ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్
- పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం

పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 15 : ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం ఖమ్మం ఎంపీ స్థానానికి ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి, నామినేషన్ల ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. 21న ఆదివారం మినహా మిగతా 7 రోజులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. అభ్యర్థికి సంబంధించి 3 వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, కలెక్టర్ ఛాంబర్‌లో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. 26న అదే ఛాంబర్‌లో స్క్రూట్నీ ఉంటుందని, 29 వరకు ఉపసంహరణకు గడువు ఉందని తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల ఖర్చుపై తాజాగా బ్యాంక్ ఖాతాలు తెరవాలని, ఎన్నికలకు సంబంధించిన లావాదేవీలన్నీ ఈ ఖాతా నుంచే జరపాలన్నారు. అన్ని రకాల అనుమతుల కొరకు సువిధ సింగిల్ విండో ద్వారా 48 గంటల ముందస్తుగా దరఖాస్తు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా పాటించాలని, నామినేషన్ స్వీకరణ చెక్‌లిస్ట్ అందజేసి, దాని ప్రకారం సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తె